కథా నిలయం
4678
శ్రీకాకుళం

# నిశ్శబ్దం ఒక పదం కాదు

నిశ్శబ్దం ఒక శాంతి. నిశ్శబ్దం ఒక వరం. నిశ్శబ్దం నీలాకాశపు వైశాల్యం. నిశ్శబ్దం ఒక లతాగుల్మాల లోయ పుష్ప సౌందర్యం.

❖ ❖ ❖

తను పడుకొనే గది కిటికీ తలుపులు తెరిస్తే, రాములవారి గుడి శిఖర దర్శనమవుతుంది - రావుగారికి. ఒక హృదయ నమస్కారం. మసక చీకటి. వేకువ తులశి. నిశ్శబ్దం ఆధ్యాత్మిక ఇంద్రధనుర్వలయం.

నెమ్మదిగా నడిచి మధ్యహాలులో లైట్ స్విచ్చివేసి పూజా గదిలో సాయిబాబా పటం ముందు ఒక అగరుబత్తీ వెలిగిస్తారు. కాకడా హారతి. "నేనుండగా నీకు సంచిత కర్మ గురించిన భయమెందుకు భాయీ?"

తిరిగి వచ్చి రాగి చెంబులో చల్లని నీరు మూడు గుక్కలే తాగి భక్తి గీతాలకై రేడియో ఆన్ చేస్తారు. మంద్ర నిశ్శబ్దం. మనోనేత్రం. మహాశాంతి.

పది నిమిషాలలోపే పాలవ్యాన్ గంట, రెండు లీటర్లకు టోకెన్లు.

ఇంకో రెండు నిమిషాల్లో కాలనీ మొదటి ఎవెన్యూలో నివశించే మేజర్ కిషన్‌లాల్ గారి తండ్రి రామలాల్ మిశ్రా గారి హిందీ సంబోధన.

'రావ్ సాహెబ్ -- మై ఆయా హూ"

తెల్లకాన్వాస్ షూ. ప్రభాత ఫేరీ లాంటి కాలనీ పరిభ్రమణ. మూడు కిలోమీటర్లు.

మిశ్రాగారికి భార్యా వియోగం, కోడలితో కొన్ని సమస్యలు. నిశ్శబ్ద ఉషఃకల్యాణ లావణ్యంలో ఒక ఆక్రందన పరిభాష.

తిరిగి వచ్చి కాలకృత్యాలు, చన్నీటి స్నానం, రెండు ఇడ్లీలు. ఒక తేనీరు కప్పు.

బయట వేచివున్న నలుగురైదుగురికి హోమియోపతి మందులు.

మిశ్రాగారి నిద్రలేమికి మదర్‌టించర్. పరమశివంగారి వేలిమీద వార్ట్‌కు తూజా.

నారాయణ కూతురికి స్వల్ప అజీర్ణం -నక్స్‌వామికా.

పల్సడిల్లా ఇదివరకు ఇచ్చారండీ కమల.

ఇచ్చాం. ఇప్పుడు పొటెన్సీ మారుస్తున్నాం.

మంచి మందు.

"ఎందుకొచ్చిన తామరతంపర. రామా క్రిష్ణా అంటూ కూచోక" రావుగారు వినలేదు.

## 2

నిశ్శబ్దం ఊడలు దిగిన మహావృక్షం. నిశ్శబ్దం నిష్క్రమణద్వారం.

కాలం - మలుపులో పొంచివున్న కృద్ధసర్పం.

ఆ ఉదయం -

పాలవాన్ గంట, ఒకటి, రెండు, మూడుసార్లు. "దూధ్"..... "పాలు...సార్"

పైనుంచి పెద్దకొడుకు దిగి వచ్చి పాల సీసాలు అందుకొన్నాడు. నాన్నగారు బద్ధకించరే. ఐదు నిమిషాలు.

మిశ్రాగారి పిలుపు. "రావ్ సాబ్...రావ్‌సాబ్" తబీయత్ ఠీక్ నహీక్యా?"

అచ్చా...అచ్చా.

"అమ్మా-నాన్నగారు లేవలేదా? గదిలో కనబడరేం?"

"ధనుర్మాసం. గుళ్ళోకి వెళ్లారేమో నాయనా"

హోమియో తీపి మాత్రల కోసం వేచివున్న వారు వెళ్లిపోయారు. మిశ్రాజీ మళ్లీ వచ్చి తిరిగిపోయారు. గుడి ద్వారాలు మూసివేశారు. మనమడూ, మనవరాలు కాన్వెంట్‌కు వెళ్ళే హడావిడి. ఇవ్వాళ వైట్‌షూ, పాలిష్ అయిపోయిందని ముందుగా చెప్పరా? టిఫిన్ డబ్బాలు ఎక్కడ దాచారర్రా?

పిల్లలు వెళ్లిపోయాక మహా ప్రశాంతి. ఆ అత్యాధునిక గృహంలో.

కొడుక్కు అనుమానం వేసింది. కోడలు వచ్చింది. చెప్పులిక్కడే వున్నాయే. రాగి చెంబు నీళ్ళూ తరగలేదు. దుప్పటి మడిచి వుంది. రాత్రి ఈ మంచం మీద పడుకోలేదే. కిటికీ మూసేవుంది. సాయిబాబాకు హారతి అగరబత్తిలేదు. రేడియో మూగగానే వుంది.

"చిన్న పాపకు ఫోను చేసి చూడు". నోనో రాలేదు. ఏమిటా కంగారుగా మాట? కోడలు తెలివిగలది.

ఉత్తరాలు చూడండి.

కొత్తవేమీ లేవు. పాతవి ఇనుప తీగెకు తగిలించేవున్నాయ్. ఆయన బ్యాంక్ పాస్ బుక్ - డ్రాయర్లో పెట్టుకొంటారు. చూడండర్రా.

"అక్కడే వుంది"

బావగారికి టెలిగ్రాం. బాబాయికి టెలిగ్రాం.

స్కూటర్ మీద ఆస్పత్రిదాకా వెళ్లి రారా- తమ్ముడికి పురమాయింపు.

నలుగురి నోట్లో పడితే నామరదా. ఊరికెళ్లారని చెప్పండి.

ఎప్పుడొస్తారో?

"పదిరోజులు"

కొడుకు తలపట్టుకొన్నాడు.

"అమ్మా, ఏమిటి మొన్న నాన్నగారూ, నువ్వూ వాదించుకొంటున్నారు?"

"పిల్లలు టి.వి. చూసి ఆలస్యంగా నిద్రపోయారు. రేడియో ఆపుచేయమన్నందుకు కోపం"

"ఆ మాత్రం ఆయనకు తెలుసుగదా. అంత పెద్ద వాదనెందుకమ్మా"

"మనసులో ఏముందో తెలీదు. అక్కతోగూడా చికాకుగా మాట్లాడుతున్నారు. ఎప్పుడూ తన వాళ్ల గొడవే. ఇంట్లో సంగతి చిన్న మెత్తు పట్టదు"

"అక్కయ్య మాత్రం అట్లా మీద మీదకు పోయి అంత పరుషంగా ఎందుకు మాటలనాలి. ఎవరికైనా ఆత్మగౌరవం వుంటుంది. ఇంట్లో సంగతులు ఆయన చెయ్యాల్సిన వేమున్నాయని?"

"దాని పిల్లకు లెక్కలు రాలేదని దాని ఆవేదన, ఈయనగారు సుమతీ శతకం పద్యాలు అప్పజెప్పమని గొడవ. ఎవరికైనా విసుగు వస్తుంది.."

"ఇంత మాత్రానికే...?"

"నాయనా - వాళ్ళనీ వీళ్ళనీ అంటావెందుకు? నువ్వు చేసిన ఘనకార్యం

ఏమిటి? నీ స్నేహితులముందు ఏదో చెప్పొస్తే, లోపలికొచ్చి - తమరు కొంచెం నోరు మూసుకొమ్మంటం-ఏమి సబబు రా!?"

"అదేమి కాదండీ... వాళ్ళ నాన్నగారి తద్దినమని అన్నారు. ఇంట్లో కుదరదు, మఠంలో పెట్టుకోండని అత్తగారన్నారు. ఆ రోజు నుంచీ మనిషి మాటలు చాలించారు" చిన్న కోడలు తెలివిగా మాట్లాడగలదు. రెండర్థాలు.

"మిమ్మల్నెవర్నీ అర్థించలేదుగదా. తన డబ్బు. వంట మనిషి దగ్గిర్నుంచి ఆయనే ఏర్పాటు చేసుకొంటున్నారు. "తన వాళ్ళని" ఎవరికైనా ఉంటుంది. అది తప్పుగాదుగా. ఛీ-ఛీ-ఛీ-- ఇటు వంటి మనుషుల్ని నేనెక్కడా చూళ్ళేదు"

దూరాల నుంచి పెద్దనాన్న, బాబాయి, బావా వచ్చారు. వెళ్లారు. "రావ్‌సాబ్ సే కుచ్‌ఖబర్-కుచ్ లెటర్ ??

"దీని కంతకూ కారణం నువ్వు.

ఆమాత్రం మనుషుల్ని అర్థం చేసుకోలేక పోతే ఎందుకు? నేను చికాకుగా ఏదో అన్నాను. నీకు తెలీదు - ఆ రాత్రే ఆయన మంచం వద్దకు వెళ్ళి క్షమాపణ చెప్పుకొన్నాను" కొడుకు.

## 3

నిశ్శబ్దం ఒక పరివేదన, ఒక పశ్చాత్తాపం. నిశ్శబ్దం మూడక్షరాలు, మూడు మహాసముద్రాలు.

❖ ❖ ❖

నాలుగైదేళ్ల తర్వాత -

...పాలెం. ఆశ్రమం నుండి ఉత్తరం వచ్చింది.

"శ్రీ రావుగారు గత నాలుగేళ్లుగా ఈ ఆశ్రమ నివాసి. ఎప్పుడూ యోగ సమాధిలో వున్న మహాఋషిగా యిక్కడ మెలిగారు. తోటి వృద్ధులకు చేతనైనంత సేవ చేశారు. క్రితం నెల రథ సప్తమి నాడు తన నిద్రలోనే ప్రశాంతంగా బ్రహ్మైక్యం చెందినారు. మొన్ననే వారి కాగితాలు కొన్ని లభ్యం కాగా ఈ చిరునామా కనబడింది. బ్యాంక్ ద్వారా వారు ఆశ్రమానికి అర్పించదలచిన ధనం గూడా అందినది. ధన్యజీవులు. వారి కాయితాలన్నీ మీరు పంపమంటే పంపగలము"

## 4

నిశ్శబ్దం - ఒక సమాధినీడ.

నిశ్శబ్దం - ఒక మహాసర్పం.

నిశ్శబ్దం - ఒక మహాస్వప్నం గూడా.

❖ ❖ ❖

రావుగారి ఫోటో ఎన్లార్జి అయి ఇప్పుడు గోడ మీద ప్రముఖంగా కనిపిస్తున్నది. అగరుబత్తి వెలుగుతుంది. చెమ్కి పూలమాలా మెరుస్తుంటుంది.

...పాలెం ఆశ్రమాధిపతులు ఆయన పత్రాలన్నీ పంపించారు.

ఆ కాయితాలు ఎవరూ విప్పి చదవ సాహసించలేదు. సుప్తతాళ పత్రాల రహస్య శబ్దాలు.

అయినా-

పాల వాన్ గంట మోగటం మానలేదు.

గుడిశిఖరం-ఉదయ కాంతిలో మెరుస్తూనే వుంది.

రామ్‌లాల్ మిశ్రా గారి పిలుపు మాత్రం వినబడటంలేదు.

ఇప్పుడు నిశ్శబ్దం - ఒక భయం. ఒక అందోళన.

✿ నేత్రం - త్రైమాసిక - 1995

"సత్సంగత్వే నిస్సంగత్వం
నిస్సంగత్వే నిర్మోహత్వమ్"

-భజగోవింద స్తోత్రం నుండి